కూలీలకు భలే డిమాండ్

పెరుగుతున్న పెట్టుబడి ఖర్చు • ఇతర ప్రాంతాల నుంచి కూలీల దిగుమతి

షాబాద్ మండలంలో జోరుగా కలుపుతీత పనులు ● ఎకరానికి రూ.5వేల నుంచి 6వేలకుపైనే

షాబాద్: రైతులు సాగుచేసిన పంటలను కలుపుతీసేందుకు వ్యవసాయ కూలీలకు మంచి డిమాండ్ ఉంది. మండలంలో రైతులు సకాలంలో విత్తనాలు వేశారు. ప్రస్తుతం పొలాల్లో కలుపుతీత పనులు జోరందుకున్నాయి. అయితే వ్యవసాయ కూలీలకు డిమాండ్ ఏర్పండిందని రైతులు చెబుతున్నారు.



మరియాపురంలో పత్తి పంటలో కలుపు తీస్తున్న కూలీలు

పత్తిసాగుపై ఆసక్తి..

- మండలంలో అధికంగా పత్తి సాగు చేశారు. గత సంవత్సరం 35 వేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ సంవత్సరం 30వేల ఎకరాల్లో సాగవుతున్నట్లు సమాచారం.
- ప్రస్తుతం పత్తి పొలంలో కలుపుతీత పనులు, సాళ్లలో దంతెలు పట్టడం జోరుగా సాగుతున్నాయి. ఎకరం పొలంలో కలుపుతీసేందుకు రూ.5 నుంచి రూ.6వేలు కూలీలకు చెల్లించాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు.
- కూలీలను రైతులు సాగుచేసే పొలాలకు తరలించేందుకు అదనంగా రూ.2వేలు రవాణా ఖర్చు చెల్లించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.
- దినసరి కూలీకి రూ.400 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోందంటున్నారు. అదేవిధంగా సాళ్లలో దంతెలు పట్టడానికి ఎకరానికి రూ.1500 నుంచి 2వేలు చెల్లిస్తున్నట్లు పేర్కొంటున్నారు. కూలీల ఖర్చు అదనమంటున్నారు.

కూలీల కొరత..

- ప్రస్తుతం కలుపుతీత పనులు కొనసాగుతున్నాయి. కూలీల కొరతతో వారికి డిమాండ్ పెరిగింది.
- షాబాద్‌కు మహబూబ్‌నగర్, కర్నూల్, కొడంగల్ తదితర ప్రాంతాల నుంచి కూలీలు, రైతులు వస్తున్నారు.
- స్థానికంగా పత్తి, మొక్కజొన్న, వరి పంటలను అధికంగా సాగు చేయడంతో పనులు చేసేందుకు కూలీలు దొరకడం లేదు.
- స్థానికంగా కూలీలు ఉన్నా కలుపుతీత ఒకేసారి రావడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడినట్లు తెలుస్తోంది.
- ప్రస్తుతం కలుపుతీత పనులు చేపట్టకపోతే పిచ్చి గడ్డి ఏపుగా పెరిగి పంటను ఎదగనివ్వకుండా చేస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.
- అంతే కాకుండా మళ్లీ వర్షాలు కురిస్తే కలుపుతీత చేపట్టేందుకు ఇబ్బందికరంగా ఉంటుందని పేర్కొంటున్నారు.

కూలీలు దొరకడం లేదు



పత్తి పంటలో కలుపు తీయించేందుకు స్థానికంగా కూలీలు దొరకడం లేదు. అందరూ ఒకేసారి పనులు చేపట్టడంతో కూలీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి పనులు చేయిస్తున్నాం.

–విజయభాస్కర్‌రెడ్డి, రైతు, మరియాపురం

పెట్టుబడి పెరుగుతోంది



నేను నాలుగు ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశా. ఇప్పటికి ఒకసారి కలుపు తీయించా. వారం క్రితం కురిసిన వర్షాలకు మళ్లీ 15 రోజుల్లో కలుపుతీత పనులు చేపట్టాలి. గతంలో రోజుకి రూ.400 ఇచ్చే వాళ్లం. ప్రస్తుతం రూ.500 నుంచి 600 వరకు చెల్లించాల్సి వస్తోంది. దీంతో పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నాయి.

–యాదవరెడ్డి, రైతు, బొబ్బిలిగామ

సొంత నిధులతో రోడ్డు పనులు

షాబాద్: మండల పరిధిలోని పోతుగల్ గ్రామ పంచాయతీకి చెందిన చిన్నతండా యువకులు మూడవత్ గోపాల్, వర్త్య మోహన్, కత్రోవత్ క్షకాంత్, వర్త్య పాండు, మోడల్ పాండు పోతుగల్ గ్రామానికి చెందిన పామెన రాజు, మాచన్‌పల్లి శ్రీధర్‌గౌడ్, తదితరులతో కలిసి సొంత నిధులతో పోతుగల్ హైవే రోడ్డు నుంచి చిన్నతండా వరకు సుమారు ఒక కిలోమీటర్ మట్టిరోడ్డు నిర్మాణ పనులను చేపట్టారు. తండాకు రోడ్డు సరిగాలేకపోవడంతో కాలినడకన వెళ్లే ప్రజలు సైతం ఇబ్బందులు పడుతున్నారని, వారి ఇబ్బందులు తొలగించేందుకు తామే స్వచ్ఛందంగా ముందుకొచ్చి రోడ్డు వేయిస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వారిని అభినందించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.



రోడ్డుపై మట్టి వేయిస్తున్న యువకులు

దుకాణాల అద్దె గడువును పెంచాలని వినతి



మంత్రి పొన్నంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

షాద్‌నగర్‌రూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో ఉన్న దుకాణాల అద్దె గడువును పెంచాలని కోరుతూ సోమవారం రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ వినతి పత్రాన్ని అందజేశారు. ఆర్టీసీ ఆవరణలోని షాపులను అద్దెకు తీసుకున్నవారు పేద కుటుంబాలకు చెందిన వారని, షాపులు నడవక ఇబ్బందిపడుతున్నారని పేర్కొన్నారు. వారి కష్టాలను దృష్టిలో పెట్టుకొని దుకాణాల అద్దె గడువును పెంచేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

కేజీరెడ్డి కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణరెడ్డి

మొయినాబాద్: రక్తదానం చేయడం అంటే ప్రాణదానం చేయడమేనని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ సాయి సత్యనారాయణరెడ్డి, అరిస్టాటిల్ పీజీ కళాశాల ప్రిన్సిపాల్ ఎల్.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని కేజీరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో రెడ్ క్రాస్ సొసైటీ, లయన్స్ క్లబ్ ఆఫ్ క్యాపిటల్ హైదరాబాద్ భాగస్వామ్యంతో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం వారు మాట్లాడుతూ.. రక్తదానం చేయడం ద్వారా ప్రాణాపాయ స్థితిలో ఉన్నవారి ప్రాణాలను కాపాడొచ్చన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఈ సందర్భంగా 55 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రత్నాచారి, మల్లారెడ్డి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

క్రికెట్ కిట్ అందజేత

చేవెళ్ల: గ్రామీణ క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గోనే కరుణాకర్‌రెడ్డి అన్నారు. మండలంలోని ముడిమ్యాల గ్రామంలోని క్రికెట్ జట్టు సభ్యులకు సోమవారం గ్రామానికి చెందిన నాయకుడు కరుణాకర్‌రెడ్డి తన సొంత డబ్బులతో క్రికెట్ కిట్‌ను అందజేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు వంగ శ్రీధర్‌రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు శేరీ శ్రీనివాస్, ఊరడి వెంకటేశ్, రాములు, సీహెచ్ వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

షాద్‌నగర్: ప్రతిరోజు యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని పతాంజలి యోగా సమితి వ్యవస్థాపకుడు పానుగంటి శశిధర్ అన్నారు. పట్టణంలోని ఈశ్వర్ కాలనీలో గల అభ్యాస్ పాఠశాలలో మహిళలకు నిర్వహిస్తున్న ఉచిత యోగా శిక్షణా తరగతులను సోమవారం పానుగంటి శశిధర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ తప్పనిసరిగా యోగా సాధన చేయాలని సూచించారు. యోగాను సాధన చేయడంతో మానసికోల్లాసం కలగడంతో పాటుగా ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుందన్నారు. మహిళలు ఉచిత యోగా శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రామయ్య, లావణ్య, జ్యోతి, వనజ, శైలజ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



యోగాసనాలు చేయిస్తున్న పానుగంటి శశిధర్

పేద కుటుంబాలకు చేయూత

షాబాద్: పేదకుటుంబాలను ఆదుకునేందుకు తమ వంతు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీరాంరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని తిర్మలాపూర్ గ్రామానికి చెందిన కృష్ణ ఉమారాణి కూతురుకు తనవంతు సాయంగా రూ.5,211వేలు ఆర్థికసాయం అందజేశారు. ఇప్పటివరకు తమ గ్రామంలో మొత్తం 25 మంది ఆడబిడ్డలకు జన్మనిచ్చిన వారందరికీ రూ.5వేల 211 రూపాయల చొప్పున సాయం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్తులు బందయ్య, మల్లేశ్ రమేశ్, కృష్ణ, శేఖర్ తదితరులు ఉన్నారు.

విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయండి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విశ్వంమాదిగ

షాబాద్: ఈ నెల 13న చేపట్టనున్న చలో హైదరాబాద్ విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు ముక్క విశ్వంమాదిగ, జిల్లా కార్యదర్శి శివశంకర్ కోరారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణను సమర్థిస్తూ సుప్రీం కోర్టులో అనుకూలంగా తీర్పు రావడం అభినందనీయమన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై ఈనెల 13న హైదరాబాద్‌లో చేపట్టనున్న విజయోత్సవ ర్యాలీకి పెద్దఎత్తున ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ప్రవీణ్‌కుమార్, మహేందర్, రాములు, జగన్, శేఖర్, సురేశ్, రమేశ్ ఉన్నారు.

షాద్‌నగర్: ఎస్సీ వర్గీకరణ విజయం తర్వాత ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ హైదరాబాద్‌కు విచ్చేస్తున్న సందర్భంగా మంగళవారం నిర్వహించే విజయోత్సవ ర్యాలీని జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు నర్సింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజాస్వామికవాదులు, మేధావులు, విద్యార్థి సంఘాల నాయకులు పెద్దఎత్తున సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు తరలివచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు.

పాడి ఆవులు మృతి

షాద్‌నగర్‌రూరల్: అకస్మాత్తుగా పాడి ఆవులు మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని విఠ్యాల గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. విఠ్యాల గ్రామానికి చెందిన పాడి రైతు బోయలింగం గత రెండు నెలల క్రితం రూ.3లక్షలు వెచ్చించి రెండు పాడి ఆవులను తీసుకున్నాడు. వ్యవసాయ పొలం వద్ద ఉంచి వాటిని పోషిస్తున్నాడు. ఈ నేపథ్యంలో రెండు పాడి ఆవులు అకస్మాత్తుగా చనిపోవడంతో బోయలింగం, నీలమ్మ దంపతులు కన్నీరు, మున్నీరుగా విలపించారు. బోయలింగంను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయస్వామి దేవాలయ నిర్మాణానికి మాజీ ఎంపీపీ చల్లా వెంకటేశ్వర్‌రెడ్డి రూ.51వేల విరాళాన్ని సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చల్లావెంకటేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో కనుమరుగువుతున్న పురాతన దేవాలయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకొని భగవన్నామస్మరణ చేయాలన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కక్కునూరి వెంకటేశ్‌గుప్తా, అన్మా వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

బీజేవైఎం ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ

మొయినాబాద్: మండల కేంద్రంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు సోమవారం జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు. స్వాతంత్ర్య సరయోధులను గుర్తుచేసుకుంటూ దేశ సమైక్యతను చాటి చెప్పే విధంగా నినాదాలు చేశారు. ఆగస్టు 15న ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగురవేయాలని ర్యాలీలో పాల్గొన్న నేతలు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కంజర్ల ప్రకాశ్, కౌన్సిల్ మెంబర్ ప్రభాకర్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గణేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

మార్మోగిన శివనామస్మరణ



స్వామివారి దర్శనానికి తరలివచ్చిన భక్తులు

మొయినాబాద్‌రూరల్: శ్రావణమాస రెండో సోమవారం సంగమేశ్వర దేవాలయం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం నుంచే ఆలయంలో వేదపండితులు, అర్చకులు గణపతి హోమం, గజస్తంభ పూజలు నిర్వహించారు. అనంతరం 1101 కలశాలతో సహస్ర కలిశాభిషేకాలు, శివలింగానికి అభిషేకాలు చేశారు. చుట్టుపక్క గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు శివనామస్మరణతో మార్మోగాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నదానం ఏర్పాటు చేశారు.

ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్తులు

కొందుర్గు: గత కొంతకాలంగా కొందుర్గు దళితవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేసిన ఉపాధ్యాయులు ప్రేమ్‌సాగర్, అనురాధ ఇటీవల బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఉపాధ్యాయులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ వైస్ ఎంపీపీ రాజేశ్ పటేల్ మాట్లాడుతూ.. కొందుర్గు దళితవాడ పాఠశాలలో ప్రేమ్‌సాగర్ అందించిన సేవలు మరువలేనివని, మూతపడిన పాఠశాలను అభివృద్ధి పథం వైపు నడిపించిన ఘనత ఆయనదేనన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ కిష్టారెడ్డి, గ్రామస్తులు ప్రవీన్, మానయ్య, శ్రీను, సుందర్, సుధాకర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్

కేశంపేట: సర్వ శిక్ష అభియాన్‌లో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కంప్యూటర్ కమ్ ఆపరేటర్ (సీసీఓ) మండల అధ్యక్షుడు ఎల్లయ్య డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాటిగడ్డ గ్రామంలో ఉన్న కేజీబీవీలో సోమవారం సీసీఓలో విధులు నిర్వహిస్తూ ఇటీవల రాష్ట్ర వ్యాప్తంగా మృతి చెందిన ఉద్యోగులకు నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎల్లయ్య ఉద్యోగుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎస్ఎస్ఏలో పని చేస్తున్న ఉద్యోగులకు కనీస వేతనం అమలు చేయాలన్నారు. మరణించిన ఉద్యోగులకు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఎస్ఎస్ఏ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలను చేస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్ఓ గౌసియాబేగం, సీఆర్పీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీటీరోడ్డు పనులు ప్రారంభం

కేశంపేట: మండలంలోని కాకునూర్ గ్రామానికి బీటీరోడ్డు పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. కేశంపేట నుంచి కాకునూర్ వరకు రోడ్డు గుంతలమయంగా మారడంతో వాహనదారులు ప్రమాదాల బారినపడ్డారు. ఈ విషయాన్ని గ్రామస్తులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ దృష్టికి గతంలో తీసుకెళ్లారు. దీంతో ఈ రోడ్డు పనులు ప్రారంభం కావడంపట్ల కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూడ వీరేశ్, నాయకులు పర్వతాలు, శ్రీశైలం, రాములు, భీమయ్య, నరేందర్‌రెడ్డి, నర్సింలు, మల్లేశ్, శ్రీశైలం, కోటిరెడ్డి, మస్తాన్‌రెడ్డితో పాటు గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్ఎఫ్ఐ కమిటీ ఎన్నిక

చేవెళ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి బి.అరుణ్‌కుమార్ ఆధ్వర్యంలో నూతన కమిటీ ఎన్నిక, సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కళాశాల విద్యార్థులతో కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. అనంతరం కళాశాలలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొత్తగా నిర్మించిన భవనానికి చుట్టూ ప్రహరీ లేకపోవటంతో విద్యార్థులకు ఇబ్బందిగా ఉందన్నారు. చుట్టూ ఓపెన్ స్థలం ఉండటంతో కళాశాలలోకి విషసర్పాలు, క్రిమికీటకాలు వస్తున్నాయని పేర్కొన్నారు. దీనిపై వెంటనే అధికారులు స్పందించి కళాశాలకు ప్రహరీ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. అనంతరం కమిటీ అధ్యక్షుడిగా వివేకానంద, కార్యదర్శిగా మహేందర్, సహాయ కార్యదర్శిగా మనోజ్‌కుమార్, మహిళా కన్వీనర్‌గా అఖిల, సభ్యులుగా ప్రవళిక, అశ్విని, చైతన్య, స్కూల్ కమిటీ అధ్యక్షుడిగా వినయ్, కార్యదర్శిగా మనీ ప్రసాద్‌లను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సాయి, గణేశ్, విద్యార్థులు ఉన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత

ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని రాసుమల్లగూడ గ్రామస్తుల అభ్యర్థన మేరకు గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయానికి ఆయన సొంత ఖర్చులతో బోరుమోటార్‌ను ఏర్పాటు చేయించారు. నూతనంగా ఏర్పాటు చేసిన బోరుమోటార్‌ను సోమవారం ఎమ్మెల్సీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతిఒక్కరూ భక్తిభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలను చేపడుతూ ఆలయాల అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్సీని గ్రామస్తులు పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాధవిరంగయ్య, మాజీ ఎంపీటీసీ భీష్వరామకృష్ణ, మాజీ ఉపసర్పంచ్ యాదయ్య, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగభూషణ్, మాజీ వార్డు సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



బోరుమోటార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్, ప్రకాశ్

శంకర్‌పల్లి: కేంద్రం నుంచి అందుతున్న సంక్షేమ, అభివృద్ధి ఫలాలను రాష్ట్రంలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రచారం చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు అంజన్‌కుమార్, కంజర్ల ప్రకాశ్ అన్నారు. సోమవారం శంకర్‌పల్లి పట్టణంలోని ఓ ప్రైవేట్ గార్డెన్స్‌లో మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించగా వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పార్టీలో ఉన్నవారికి తగిన సమయంలో గుర్తింపు లభిస్తుందని, ఎవరూ అధైర్యపడొద్దన్నారు. అదే విధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అన్ని స్థానాల్లో పోటీ చేసి మెజార్టీ స్థానాలను కైవసం చేసుకోవడమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీలో చిన్నచిన్న పొరపాట్లు ఉంటే సరిచేసుకొని ముందుకుసాగాలన్నారు. సమావేశంలో నాయకులు ప్రభాకర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గోవర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రాములు, వాసుదేవ్ కన్నా, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు

షాద్‌నగర్‌రూరల్: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని వ్యసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకట్‌రాములు డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని వ్యవసాయ కార్మిక సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ కూలీలకు వారం వారం రావాల్సిన ఉపాధి నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడంలేదన్నారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం ప్రతి వారం బిల్లులను చెల్లించకుండా చట్టాన్ని తుంగలో తొక్కుతోందని ఆరోపించారు. కూలీలకు నెలలు గడిచినా బిల్లులు విడుదల చేయకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. ఉపాధిహామీ పథకాన్ని నిర్వీర్యం చేయడంలో భాగంగానే కూలీలకు డబ్బులు విడుదల చేయడం లేదని, దీంతో కూలీలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టంలో అనేక మార్పులను చేయడంతో వేలాది మంది ఈ పథకానికి దూరమయ్యారన్నారు. ఇప్పటికైనా ఉపాధిహామీ పథకంలో పని చేస్తున్న కూలీలకు బీజేపీ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న కూలీ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ పద్మ, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనునాయక్, జిల్లాకార్యదర్శి జగన్, పద్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం

ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్

షాద్‌నగర్‌రూరల్: విద్యారంగ సమస్యలపై అలుపెరగని పోరాటం చేస్తున్న ఏకైక విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని సంఘం జిల్లా అధ్యక్షుడు పవన్‌చౌహాన్ అన్నారు. ఏఐఎస్ఎఫ్ 89వ ఆవిర్భావ వేడుకలను సోమవారం ఏఐఎస్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఆకాశ్‌నాయక్, విజయ్‌చారి ఆధ్వర్యంలో పట్టణంలోని ప్రభుత్వ బాలికల కళాశాల వసతి గృహం ఆవరణలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పవన్‌చౌహాన్ హాజరై సంఘం జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్‌చౌహాన్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో ఏఐఎస్ఎఫ్ ప్రధాన భూమికను పోషించిందన్నారు. రాష్ట్రంలో కేజీ టూ పీజీ ఉచిత విద్యపై, సంక్షేమ హాస్టళ్లలో మెస్ చార్జీలు పెంచాలని, యూనివర్సిటీలలో వీసీలను నియమించాలని అనేక ఉద్యమాలను చేపట్టామన్నారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై అనునిత్యం పోరాడుతున్న ఏఐఎస్ఎఫ్ సంఘంలో ప్రతి విద్యార్థి చేరాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శివ, సాయి, నరేశ్, శ్రీను, అంకిత, పూజ, స్వప్న, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

ప్రభుత్వ పాఠశాలలపై పర్యవేక్షణ కరువు

జీటీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నర్సింహ

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలలను పర్యవేక్షించాల్సిన ఎంఈఓలు లేక పాఠశాలల పనితీరు మరుగునపడిపోతుందని, ఆయా మండలాల్లోనే సీనియర్ ప్రధానోపాధ్యాయులను ఎంఈఓలుగా నియమించాలని జీటీఏ జిల్లా అధ్యక్షుడు ఎస్.నర్సింహ అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని సంఘం నాయకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులతో మెంబర్‌షిప్ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకారం అందించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ వహించి ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్‌చేశారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జీటీఏ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి టి.సుధాకర్, పాఠశాల హెచ్ఎం బి.శ్రీనివాస్, మహిళా కార్యదర్శి టి.సునీత, సభ్యులు బి.వీరన్న, రమణాకుమార్, రజినీకాంత్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.



సభ్యత్వ నమోదు నిర్వహిస్తున్న నాయకులు

ఎక్కడి చెత్త అక్కడే..

ఫొటోకు ఫోజిచ్చి చేతులు దులుపుకొన్న అధికారులు



పీహెచ్‌సీ ఆవరణ శుభ్రం చేస్తున్న సిబ్బంది, అధికారులు (ఫైల్)



పీహెచ్‌సీ ఆవరణలో చెత్తకుప్పలు

కొందుర్గు: ప్రభుత్వం స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా పరిసరాల పరిశుభ్రత నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగా పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ఆస్పత్రుల ఆవరణలో చెత్తాచెదారం శుభ్రం చేయాలని సూచనలు అందాయి. అధికారులు ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టి చెత్తా చెదారం శుభ్రం చేసే కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా కొందుర్గు పీహెచ్‌సీ ఆవరణలో చెత్తా చెదారం శుభ్రం చేస్తున్నట్లు ఫొటోకు ఫోజిచ్చారే తప్పా పీహెచ్‌సీ ఆవరణలో ఎక్కడి చెత్త అక్కడే వదిలేశారు. ఇది అధికారుల పనితీరుకు నిదర్శనమని స్థానికులు మాట్లాడుకుంటున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి,
జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు
మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
జి. మల్లికార్జున్
9505507564